# అసలు స్వరూపం

**-సన్షిత్ ఎల్వేవి**

అన్ని ఆఫీసుల్లాగే ఫైళ్ల దొంతరలు ముందేసుక్కూర్చుని పనిచేసుకుంటూ పోయే ఉద్యోగులతో, ప్రతీ అరగంటకూ కేంటీన్ వైపు వెళ్తూ పొద్దుపుచ్చే కాలక్షేపంరాయుళ్లతో, ఆఫీసు పనిమీద సగం మనసు, ఇంట్లోని పిల్లలమీద సగం మనసుతో అన్యమనస్కంగా ఉండే స్త్రీ జనులతో నిండిన వాతావరణం కనిపించదు మా ఆఫీసులో.

బేసికల్‌గా రక్షణ వ్యవస్థకు సంబంధించిన రీసెర్చి వర్కు కొనసాగుతుంటుంది కాబట్టి. అటువంటి ఆఫీసులో నేను 'సైంటిస్టు'గా జాయినై ముచ్చటగా మూడు రోజులయింది. అంతా కొత్త. కరెక్టుగా చెప్పాలంటే మొదటిసారి అత్తగారింట్లో అడుగుపెట్టి కొత్త కోడలి లాంటి మనఃస్థితి!

సరిగ్గా అటువంటి 'ఫేజ్'లోనే నాకు పరిచయమయ్యాడు వ్యాస్. అతడి పూర్తి పేరు అంశుమన్ వ్యాస్. నార్త్ ఇండియాలోని ఏదో పల్లెటూరి నుండి ఉద్యోగరీత్యా హైదరాబాద్ వచ్చి ఇక్కడ సెటిలయినవాడు. వచ్చీరాని తెలుగు మాట్లాడుతూ నవ్వుతూ నవ్విస్తూ అందరితో కలసిపోయే అతడి మనస్తత్వం నన్ను ఆకర్షించింది. అతడి పరిచయం ఎడారిలో ఒయాసిస్‌లా నన్ను సేదదీర్చింది. అనతికాలంలోనే మా స్నేహం ప్రాతః సమయపు ఎండలా వృద్ధి చెందసాగింది. ఫస్టు తారీఖున మొదటి జీతం అందుకోగానే ప్రపంచాన్ని జయించినంత ఆనందం కలిగింది నాకు. ఆ ఆనందాన్ని వ్యాస్‌తో పంచుకోవాలనుకున్నాను. అందుకే అతడ్ని పార్టీకి ఆహ్వానించాను.

సాయంత్రం ఎనిమిదింటికి 'శిల్పి బార్ అండ్ రెస్టారెంట్'లోకి మేం ప్రవేశించగానే స్పీకర్స్‌లోంచి పాటలు మంద్రంగా వినిపిస్తున్నాయి. డిమ్‌లైట్స్ వెలుగులో, తాగుబోతుల నవ్వులతో, గాళ్‌ఫ్రెండ్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తున్న బోయ్స్‌తో, రింగులురింగులుగా వ్యాపిస్తున్న సిగరెట్ పొగలతో, వెచ్చగా, మత్తుగా, హస్కీగా ఉంది అక్కడ వాతావరణం. ఒక కార్నర్‌లో సింగిల్ టేబుల్ చూసుకుని ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. బార్టెండర్‌కి ఆర్డర్ చెప్పి కబుర్లలో పడ్డాం.

"చెప్పు గురూ! మన బాస్ కమలాకర్ ఏమంటున్నాడు?'' మొదలెట్టాడు వ్యాస్.

"ఏమంటాడు? పాత రిపోర్టులన్నీ చదివి, అర్థం చేసుకుని, వారం రోజులులోగా అతడి ముందు ప్రెజెంటేషన్ ఇమ్మంటున్నాడు. అయినా నా లక్ష్యం, గమ్యం వేరు బాస్! ఇదంతా టైమ్ పాస్!'' అంటూ నవ్వేశాను.

ఇంతలో మేం ఆర్డరిచ్చిన మందు వచ్చింది. "ఛీర్స్'' చెప్పుకుని తాగడం మొదలెట్టాం.

"అదేంటి? మంచి జాబ్‌లో సెటిలయ్యావు. ఇంకా లక్ష్యం, గమ్యం అంటూ ఏదేదో మాట్లాడుతున్నావు...ఏంటి విషయం?'' అదోలా అడిగాడు వ్యాస్. తాగుతున్న మందు తలకెక్కడం మొదలయింది. చెప్పాలా, వద్దా, అని కాసేపు ఆలోచించి చెప్పడం మొదలెట్టాను.

"చూడు వ్యాస్! సివిల్ సర్వీసెస్ పరీక్ష పాసయి కలెక్టర్ కావాలన్నది నా జీవిత లక్ష్యం. అందుకోసం ఎప్పటి నుండో ప్రిపరేషన్ కొనసాగిస్తున్నాను. ఈ మధ్యనే 'ప్రిలిమ్స్' కూడా పాసయ్యాను. 'మెయిన్స్' కోసం ప్రతీరోజూ ఈవెనింగ్స్ కోచింగ్‌కు కూడా వెళుతున్నాను. అయితే ఆర్థిక అవసరాల కోసం ఈ జాబ్‌లో జాయినయ్యాను. చూస్తుండు... సంవత్సరం తిరిగేసరికల్లా కలెక్టర్‌నయి ఈ జాబ్ మానేస్తాను'' ఎగ్జైటింగ్‌గా చెప్పాను.

"మైగాడ్! నీ దగ్గర ఇంత స్టోరీ ఉందా? ఆల్ ద బెస్ట్!'' అంటూ చిన్నగా నవ్వాడు. పీకల్దాకా మందు కొట్టి, కడుపునిండా తిని అక్కడి నుండి బయట పడ్డాం. మరుసటి రోజు ఆఫీసుకు వెళ్లగానే మా బాస్ కమలాకర్ నన్ను తన కేబిన్‌కి పిలిచాడు.

"చూడు సురేష్! ప్రస్తుతం మన దగ్గరున్న ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌ని అప్‌గ్రేడ్ చెయ్యడానికి, స్విట్జర్లాండ్ నుండి ఇంజనీర్స్ రేపు ఉదయం వస్తున్నారు. రెండు నెలల పాటు ఇక్కడుంటారు. నీవు కూడా వాళ్లతో అసోసియేట్ అయి, పనిలో ఇన్వాల్వ్ అవు...'' అని చెప్పాడు.

ఉస్సూరుమనిపించింది నాకు. సంబంధం లేని పని అది. పైగా నా సివిల్స్ ప్రిపరేషన్. ఆ పని నాకెందుకు అంటగట్టాడో అర్థం కాలేదు.

చెప్పినట్లుగానే ఇంజినీర్స్ రానే వచ్చారు. పొద్దున్న తొమ్మిదింటికి పని మొదలు పెడితే రాత్రి ఏ పదింటికో పూర్తయ్యేది. ఇంటికొచ్చి భోజనం చేసి నిద్రపోవడం తప్పితే ప్రిపరేషన్‌కి టైముండేది కాదు. టైమున్నా ఓపికుండేది కాదు. ఆ విధంగా కలెక్టర్ కావాలన్న నా లక్ష్యం కన్వీనియెంట్‌గా నా నుండి దూరం అయింది. గమ్యం చేరలేదన్న అసంతృప్తి మాత్రం నాలో స్థిరపడింది.

★★★

కలెక్టర్‌ని అయి ప్రజలకు మేలు చేద్దామనుకున్నాను. కానీ కుదరలేదు. సైంటిస్టుగా దేశానికి సేవ చేస్తున్నానన్న ఆలోచనలో సంతృప్తిని వెదుక్కుని జాబ్‌లో పూర్తిగా మునిగిపోయాను.

"ఏంటి గురూ! తెగ సిన్సియర్‌గా పనిచేస్తున్నావు?'' అంటూ వచ్చాడు వ్యాస్.

"ఏముంది బాస్ మామూలే! రిపోర్ట్ ప్రిపేర్ చేస్తున్నాను. లేకపోతే మన కమలాకర్ ఊరుకోడు కదా!'' అంటూ నవ్వేశాను. చిరాగ్గా మొహం పెట్టాడు వ్యాస్!

"ఆ కమలాకర్ అంతే బాస్!'' ఎగిరిపడ్డాడు.

"అదేంటి బాస్! అంత మాటన్నావు?'' ఆశ్చర్యపోయాను.

"కాకపోతే మరేంటి? రోజుకొక పర్సనల్ పని చెబుతాడు. సిటీలో ఎక్కడెక్కడో తిరిగి అతడి పనులన్నీ పూర్తి చేసుకుని రావాలి. పైగా సరిగ్గా చెయ్యడం లేదని సణుగుడొకటి. ఛస్తున్నాను వెధవతో. ఇలాగే అయితే కొన్నాళ్లకి చెప్పుకోవడానికి టెక్నికల్ వర్క్ అంటూ నాకేమీ ఉండదు'' అంటూ వాపోయాడు.

నిజమే అనిపించింది. కానీ ఏం చేస్తాం? "బాస్ ఈజ్ ఆల్వేజ్ రైట్ కదా!'' తర్వాత రోజే ఆఫీసు పని మీద మేమంతా 'ఒరిస్సా' వెళ్లాం. మా రీసెర్చికి ప్రతిరూపమైన మిస్సైల్‌ని టెస్ట్‌గా ఫైరింగ్ చేయడానికి.

మండుటెండలో, వడగాల్పులు వీస్తున్న టెస్ట్ రేంజ్‌లో 'మిషన్ ఏక్టివిటీస్' అన్నీ కంప్లీట్ చేసి, 'కౌంట్ డౌన్' చెప్పి మిస్సైల్‌ని పైకి ఎగరవేశాం.

సక్సెస్‌ఫుల్‌గా అది నింగిలోకి దూసుకెళ్లింది. అందరిలోనూ శ్రమను మర్చిపోయిన ఆనందం.

ఆ రాత్రి 'గెస్ట్ హవుస్'లో ప్రతీరూమ్‌లోనూ సెలబ్రేషన్ మొదలయింది. మేం డ్రింక్ సేవించడం మొదలుపెట్టారు. మేం సెలబ్రేషన్ మా బాస్ కమలాకర్ రూమ్‌లో పెట్టుకున్నాం. తలుపు తోసుకుని లోనికి వెళ్లబోతూ నా ప్రస్తావన వినబడటంతో

అప్రయత్నంగా ఆగిపోయాను. నేను లేట్‌గా జాయినవుతాను అని చెప్పడంతో అప్పటికే కమలాకర్, వ్యాస్ రెండో రౌండ్‌లో ఉన్నారు.

సోఫాలో రిలాక్సింగ్‌గా వెనక్కు వాలి రెండు కాళ్లు టీపాయ్ మీద పెట్టి, సిగరెట్ పొగను రింగులుగా పైకి వదులుతూ తన్మయావస్థలో ఉన్నాడు కమలాకర్! అతడికి దగ్గరే కూర్చుని విస్కీని గ్లాసులో పోసి సోడా కలిపి పల్లీలు, ఆనియన్స్ మిశ్రమాన్ని ఎంతో భక్తిగా అతడి ముందుంచాడు వ్యాస్.

"ఏమంటున్నాడు నీ ఫ్రెండ్ సురేష్? కలెక్టర్‌ని అవుతాను, గాడిదగుడ్డు అవుతాను అంటూ ఎగురుతున్నాడా?'' వక్రంగా నవ్వాడు కమలాకర్.

"ఇంకెక్కడి కలెక్టర్ సార్! నోర్మూసుకుని జాబ్ చేసుకుంటున్నాడు'' విరగబడి నవ్వాసాగాడు వ్యాస్.

షాక్ కొట్టినట్లుగా అనిపించింది నాకు.

నాతో ఎంతో సన్నిహితంగా మెలుగుతూ, అప్పుడిలా అనిపించే వ్యాస్ 'గోముఖ వ్యాఘ్రం' అన్నమాట! అతడి మాటలు జీర్ణించుకోలేకపోయాను. నా ముందు కమలాకర్‌ని నోటికొచ్చినట్లు తిడుతూ, అతడి దగ్గర మాత్రం 'చెంచాగిరీ' చేస్తున్నాడు రాస్కెల్.

వ్యాస్‌కీ, నాకూ ఎటువంటి శతృత్వమూ లేదు. అయినా ఎందుకు నా వినాశనాన్ని కోరుకున్నాడు? ఎప్పుడో చిన్నతనంలో చదువుకున్న 'సుభాషితం' గుర్తొచ్చింది. పాముకి తలలో విషం ఉంటుందట. తేలుకి తోకలో విషం ఉంటుందట. కానీ దుష్టుడైన మనిషికి నిలువెల్లా విషమేనట. అతడు కూడా మనిషే కదా! అందుకే అలా ప్రవర్తిస్తున్నాడు.

'రాస్కెల్! యు ఆర్ ఎ స్నేక్' అని కసిగా తిట్టుకుంటూ లోనికి ప్రవేశించాను. వెల్‌కం...వెల్‌కం...అంటూ నవ్వుతూ ఆహ్వానించారు నన్ను ఆ 'ఇద్దరూ'.

★

